TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 141 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ సోమవారం.15.12.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## మళ్లీ హస్తానికే..

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రెండోవిడత పంచాయతీ ఎన్నికల్లోనూ అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. మొదటి విడతలో అత్యధిక స్థానాలు గెలుచుకుని జోష్ మీదున్న ఆపార్టీ.. రెండో విడతలోనూ మెజారిటీ సర్పంచ్ స్థానాలను దక్కించుకుంది. ఆదివారం జరిగిన పోలింగ్‌లో 3,911 సర్పంచ్ స్థానాలకు 12,782 మంది, 29,917 వార్డు స్థానాలకు 71,071 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. తుది వార్తలు అందే సమయానికి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు 2,241 స్థానాల్లో గెలుపొందారు. బీఆర్ఎస్ మద్దతిచ్చిన అభ్యర్థులు 1,186 స్థానాల్లో గెలిచారు. బీజేపీ 268 చోట్ల, ఇతరులు 624 స్థానాల్లో విజయం సాధించారు. నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, కామారెడ్డి, జగిత్యాల, సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాల్లో కాంగ్రెస్ సత్తా చాటింది. ఆ పార్టీ బలపర్చిన అభ్యర్థులు గణనీయ సంఖ్యలో గెలుపొందారు. సిద్దిపేట, కుమరంభీం ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల్లో బీఆర్ఎస్ ఆధిక్యాన్ని కనబర్చింది.

మెదక్, రంగారెడ్డి, వరంగల్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఆ పార్టీ మద్దతు దారులు గట్టి పోటీ ఇచ్చారు. నిర్మల్ జిల్లాలో అనూహ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను వెనక్కి నెట్టి బీజేపీ మద్దతుదారులు మెజార్టీ స్థానాలను దక్కించుకు న్నారు. అదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్‌కు బీజేపీ గట్టి పోటీ ఇచ్చింది. జగిత్యాల, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో ఆ పార్టీ అభ్యర్థులు రెండంకెల మార్కును దాటారు. మొదటి రెండు విడతల్లో కాంగ్రెస్ అభ్యర్థు లు మెజార్టీ స్థానాలను దక్కించుకోగా, బీఆర్ఎస్ రెండవ స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ పార్టీ గెలిచిన 80 శాతానికి పైగా స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు రెండవ స్థానంలో నిలిచారు. ఆ తర్వాతి స్థానాలను ఇండిపెండెంట్లు 15 శాతం, బీజేపీ 5 శాతంగా నిలిచారు. మొత్తంగా కాంగ్రెస్ పార్టీ 50 శాతం వరకు స్థానాలు దక్కించుకోగా, బీఆర్ఎస్ 25 శాతం, ఇతరులు 25 శాతం స్థానాల్లో పాగా వేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం, మరో మూడేండ్లు గడువున్న నేపథ్యంలో ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. చివరి విడతలోనూ మొదటి, రెండో విడత ఫలితాలే పునరావృతం అవుతాయని భావిస్తున్నారు.

రెండో విడతలో పెరిగిన పోలింగ్

రెండోదశ పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. మొదటి విడతలో 84.28 శాతం నమోదు కాగా, ఈ సారీ 1.58 శాతం పెరిగి 85.86 శాతంగా నమోదైంది. ఈ మేరకు తెలంగాణ ఎన్నికల సంఘం రెండో దశ పోలింగ్ వివరాలను వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడతలో 193 మండలాల్లోని 3,911 పంచాయతీలు, 71,071 వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 91.72 శాతం, ఆ తర్వాత ఖమ్మం జిల్లాలో 91.21, సూర్యాపేటలో 89.56, మెదక్‌లో 88.80 శాతం పోలింగ్ నమోదైనట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. అత్యల్పంగా నిజామాబాద్ జిల్లాలో 76.71 శాతం, ఆ తర్వాత జగిత్యాలలో 76.34, భద్రాది కొత్తగూడెంలో 82.65, నిర్మల్‌లో 82.67 శాతం పోలింగ్ నమోదైంది.




ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు కొంత మందకొడిగా సాగింది. మొదటి రెండు గంటల్లో 22.54 పోలింగ్ నమోదు కాగా, అ తర్వాత 9 నుంచి 11 గంటల వరకు 56.71 శాతం ఓటింగ్ నమోదైంది. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చివరి వరకు మొత్తం 85.86 శాతానికి చేరుకుంది. ఏకగ్రీవం, నామినేషన్ దాఖలు కాని గ్రామాలను మినహాయిస్తే మొత్తం 54,40,339 మంది ఓటర్లకు గాను 46,70,972 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 22,77,902 మంది పురుషులు (85.71 శాతం), 23,93,010 మంది మహిళలు (86 శాతం), 60 మంది ఇతరులు (41.96 శాతం) ఓటింగ్‌లో పాల్గొన్నారని ఎన్నికల సంఘం తెలిపింది.

## విశ్వనగరమంటే ఇదేనా?




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: 'హైదరాబాద్‌లోని కొన్ని చోట్ల తాగునీటిలో మురికి నీరు కలుస్తోంది. మరి కొన్ని చోట్ల తాగునీరు పెట్రోల్ వాసన వస్తోంది. ప్రతి నిత్యం నగరంలో ఏదో ఒక చోట వృద్ధుల హత్యలు జరుగుతున్నాయి. బస్తీల్లో ఖాళీలు స్థలాలను చెత్త డంపింగ్ కు యధేచ్ఛగా ఉపయోగించుకుంటున్నారు. అక్కడే డ్రగ్స్, గంజాయి వాడకం ఎక్కువగా ఉంటోంది. ఆ దారుల్లో వెళ్లే ఆడపిల్లలపై నిత్యం ఆగడాలు జరుగుతున్నాయి. మరోవైపు వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వాటి స్టెరిలైజ్ కోసం కేటాయించిన నిధులను సరిగా వినియోగించుకోకపోవడంతో రెండేండ్లలో కుక్కకాటు కేసులు 31 శాతం పెరిగాయి. ఆర్టీసీ బస్సులను సగానికి తగ్గించారు. సామాన్యులకు ప్రజా రవాణా అందుబాటులో లేకుండా చేశారు. వికలాంగులైతే ఆర్టీసీ బస్సులు ఎక్కే పరిస్థితే లేదు. ఇలాంటి నగరం విశ్వనగరం అవుతుందా?' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు.

హైదరాబాద్‌లో ఐదు రోజుల పాటు ఆమె చేపట్టిన జనం బాట ఆదివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఆదివా రం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశం లో మాట్లా డారు. జీహెచ్ఎంసీలో 27 మున్సిపాల్టీలను విలీనం చేసిన తర్వాత ఒక కోటి మందికి పైగా జనాభా పెరిగారని తెలిపారు. అంతకుముందు 7,700 ఆర్టీసీ బస్సులుంటే వాటిని 3,500కు తగ్గించారని తెలిపారు. ప్రజా రవాణా లేకపోవడంతో 80 లక్షల ప్రయివేటు వాహనాలను అనివార్యంగా ప్రజలు వినియోగించే పరిస్థితికి ప్రభుత్వమే కారణమమని ఆమె విమర్శించారు. 2022లో నగరంలోలో కుక్కకాటుకు సంబంధించి 92,924 నమోదైతే 2024 నాటికి 1,23,997 (31 శాతం) అధికంగా నమోదయినట్టు చెప్పారు.

లంగర్‌హౌజ్ బాపూఘాట్‌ను డ్రగ్స్, గంజాయి తీసుకునే అసాంఘిక శక్తులు ఉపయోగించుంటున్నా నియంత్రణ చర్యలు లేవని తప్పుపట్టారు. యాకుత్‌పురా నియోజకవర్గంలో తాగునీటిలో మురికి నీరు కలిసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అడిక్‌మెట్‌లో వస్తున్న తాగునీరు పెట్రోల్ వాసన వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సనత్‌నగర్ దాసరి బస్తీలో గంజాయి బ్యాచ్ రెచ్చిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడపిల్లలను వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్‌లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంను పిల్లలు ఆడుకునేందుకు ఇవ్వకుండా వ్యాపార అవసరాల కోసం ప్రయివేటు వ్యక్తుల కార్యక్రమాలకు ఇస్తున్నారని కవిత ఆరోపించారు.

సింగరేణి డబ్బులతో ఫుట్‌బాల్ ఆడుతారా?

సీఎం రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడడం వల్ల ఎవరికి ప్రయోజనం? అని కవిత ప్రశ్నించారు. ప్రజలకు ఉపయోగపడని ఆ ఆట కోసం జీవోను మార్చి సింగరేణి నిధులను రూ.10 కోట్లను మళ్లించారని ఆమె ఆరోపించారు. ఆ నిధులను తిరిగి సింగరేణికి ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ఏ ప్రాతిపదికన జీహెచ్ఎంసీలో 27 మున్సిపాల్టీలను విలీనం చేశారని ఆమె ప్రశ్నించారు.

ఆ విగ్రహం పెట్టొద్దు

రవీంద్రభారతిలో ఎస్.పి.బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని ఏర్పాటు చేయటాన్ని కవిత తప్పుపట్టారు. ఆ విగ్రహాన్ని పెట్టొద్దని ప్రభుత్వానికి సూచించారు. విగ్రహ ఏర్పాటుకు వ్యతిరేకిస్తున్న తెలంగాణవాదుల పక్షాన్నే తాను నిలబడతానని స్పష్టం చేశారు. రవీంద్రభారతిలో తెలంగాణ కళాకారుల విగ్రహాలను ప్రతిష్ఠించాలని కోరారు. సినీ పరిశ్రమకు చెందిన బాల సుబ్రమణ్యం విగ్రహం ఏర్పాటుకు వేరే స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని ఆమె సూచించారు.

రాష్ట్రానికి నిధులివ్వని కేంద్రం

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణకు అదనంగా నిధులు, ఇవ్వాల్సిన వాటాను కూడా పెండింగ్‌లో పెడుతున్నదని కవిత విమర్శించారు. హైదరాబాద్ లాంటి నగరాలకు అదనంగా నిధులివ్వాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని గుర్తుచేశారు.

2019-20 నుంచి 2024-25 వరకు తెలంగాణ నుంచి రూ.4,35,919 కోట్లను పన్నుల రూపేణా వసూలు చేసిన కేంద్రం వాటిలో కేవలం రూ.3,76,715 కోట్లు మాత్రమే ఇచ్చిందని చెప్పారు. రూ.59,200 కోట్లను పెండింగ్‌లో పెట్టిందని విమర్శించారు.

## డిస్టబ్‌లో ఐతే ఉన్నా..మేలో చెప్తా

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: 'సీఎం అవుతా అని ఎవరైనా అంటే నాకు సిగ్గు అవుతున్నది. ఏం అనుకుంటున్నారో ఏమో? అలాంటి మాటలు వింటుంటే చిరాకు వస్తున్నది. నేను కొంత డిస్టబ్ అయిన మాట వాస్తవం. అందుకే ఎవరి ఫొటోలు వద్దు రాహుల్ గాంధీ ఫొటో ఒక్కటే పెట్టండి అని చెప్పిన. అన్నీ ఇప్పుడే చెప్పను. సమయం వచ్చినప్పుడు చెప్తా. మొత్తం మీద డిస్టబ్‌లో ఐతే ఉన్నా. మేలో అసలు విషయం చెప్తా. ఎవరి వల్ల డిస్టబ్ అయినది చెప్తా. పొలిటికల్‌గా ఎప్పుడూ టెంప్ట్ కావొద్దు. ఆలోచించి నిర్ణయం తీసుకుంటా. వార్ ప్రకటిస్తే కొనసాగించాలి. మే వరకు వ్యూహం రచించే పనిలో ఉంటా. ఒక్కసారి డిసైడ్ అయితే వెనక్కి రాను. ముందకేవెళ్తా. ప్రచార కమిటీ చైర్మెన్ పదవిపై పెద్దగా ఆసక్తి లేదు' అంటూ కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి బాంబు పేల్చారు. హరీశ్‌రావు మీద కోపంతో బీఆర్ఎస్ పార్టీని జగ్గారెడ్డి వీడారనే కవిత వ్యాఖ్యలను కొట్టిపడేశారు. అలాంటి స్టేట్‌మెంట్లు ఇవ్వడాన్ని మానుకోవాలని సూచించారు. తాను డైరెక్ట్‌గా రాజకీయం చేస్తాననీ, హరీశ్‌రావు వెనుక నుంచి పొడుస్తాడు అంటూ కామెంట్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా కేంద్రం కాబట్టి టార్గెట్‌గా పనిచేస్తారనీ, రాజకీయంగా ఎప్పుడైనా ఘర్షణ వాతావరణం ఉంటుందని తెలిపారు. జగ్గారెడ్డి అసలు పార్టీ ఎందుకు మారాడు అనేది ఎవరికి తెలియదన్నారు. హరీశ్‌రావు మీద కోపంతో, వ్యతిరేకంతో పార్టీ మారలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ కూతురు కాబట్టి కవిత లీడర్ అయ్యిందని విమర్శించారు. తాను క్షేత్రస్థాయి నుంచి రాజకీయంగా ఎదిగానని చెప్పారు. కుటుంబ పంచాయితీలో తనను ఎందుకు ఇరుకిస్తున్నావని కవితను ప్రశ్నించారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరడానికి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కారణమనీ, తన రాజకీయం నచ్చి ఆప్తమిత్రుడు కుసుమ కుమార్ తో కబురు పంపించారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో తనను తట్టుకోలేకనే ఎస్పీ వ్యాస్‌కు సంగారెడ్డిలో పోస్టింగ్ ఇచ్చారని చెప్పారు. తనను హౌస్ అరెస్టు చేస్తే కసితో జనం ఓట్లేసి గెలిపించారని గుర్తుచేశారు. అప్పుడు వైఎస్ దగ్గరకు తనను కుసుమ తీసుకెళ్లాడనీ, ఇష్టపూర్వకంగానే కాంగ్రెస్‌లో చేరానని చెప్పారు. దాని ఫలితంగానే ఐఐటీ, ఫోర్‌లైన్ హైవే వచ్చాయని తెలిపారు. ఐఐటీ కోసం రైతులు అడిగినంత పరిహారం ఇచ్చి అడిగిన 600 ఎకరాల భూమి ఇప్పించామని గుర్తుచేసుకున్నారు. ఐఐటీ ఇస్తా దాని దగ్గర భూమి కొను వైఎస్ సూచిస్తే పట్టించుకోలేదన్నారు. కేసీఆర్ కూతురుకు అవగాహన, ఆలోచన లేదని విమర్శించారు. కేసీఆర్..చంద్ర బాబు కూడా కాంగ్రెస్ నుండి బయటకు వెళ్లినవారేనని గుర్తుచేశారు. జిల్లాలో రాజకీయంగా హరీశ్..జగ్గారెడ్డి మధ్య వార్ నడుస్తూనే ఉంటదని స్పష్టం చేశారు. తాను రాహుల్‌గాంధీతో సభ పెట్టిస్తే హరీశ్‌రావును కేసీఆర్ పిలిచి తిట్టిండని గుర్తుచేశారు. అందుకే ఆ తర్వాత ఎన్నికల్లో తనను హరీశ్‌రావు ఓడగొట్టాలని చూశాడని తెలిపారు. హరీశ్‌రావుది, తనది రాజకీయం వేరుగానీ, పని పురుగులమని అన్నారు.



## సీనియర్ అధికారుల ఆదేశాల మేరకే ట్యాపింగ్

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తన సీనియర్ల ఆదేశం మేరకే ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం నడిచిందని ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు సిట్ అధికారుల ముందు వాంగ్మూలం ఇచ్చినట్టు తెలిసింది. ఆదివారం మూడోరోజు సిట్ అధికారులు ప్రభాకర్‌రావును జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్‌రావును తమ కస్టడీలోనే ఉంచుకొని సిట్ అధికారులు ప్రశ్నిస్తున్న విషయం విదితమే. ఏడు రోజుల పాటు కస్టడీకి సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.గత ప్రభుత్వ హయాంలో సాగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని నిగ్గు తేల్చడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్న సిట్ అధికారులు.. ఎస్ఐబీ మాజీ చీఫ్ నుంచి నిజాలను రాబట్టడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే తాము ప్రశ్నించిన నలుగురు పోలీసు అధికారుల నుంచి రాబట్టిన సమాచారంతో పాటు తమ ఫోన్లు ట్యాపింగ్ చేశారని తెలిపిన అనేక మంది బాధితుల నుంచి సేకరించిన సమాచారాన్ని కూడా సిట్ అధికారులు క్రోడీకరించుకొని ప్రశ్నలను రూపొందించుకున్నారు. ఈ నేపథ్యంలో ఫోన్‌ట్యాపింగ్ చేసే సమయంలో తాము ఎవరెవరి ఫోన్లను తప్పనిసరిగా ట్యాపింగ్ చేయాల్సి ఉందో సీనియర్ అధికారులతో కూడిన స్క్రీనింగ్ కమిటీకి పంపించాల్సి ఉంటుంది. వారిచ్చిన గ్రీన్ సిగల్ మేరకే ట్యాపింగ్ వ్యవహారాన్ని ఎస్ఐబీ అధికారులు ముందుకు నడిపించడం జరుగుతుంది. అయితే బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో నడిచిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారమంతా రాజకీయ ప్రేరేపణతోనే జరిగిందనీ, అప్పటి ప్రభుత్వంలో ఉన్న కీలక నేతల ఆదేశాల మేరకే ప్రభాకర్‌రావు ఫోన్‌ట్యాపింగ్‌లను సాగించారని సిట్ ఇప్పటి వరకు సేకరించిన సమాచారాన్ని బట్టి అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో మూడో రోజు ప్రశ్నలలో ఈ ఫోన్‌ట్యాపింగ్‌ను సాగించడానికి వెనుక ఎవరి హస్తమున్నదనేది తేల్చడానికి సిట్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఆ సమయంలో ఉన్న తన సీనియర్ అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్‌లు చేశామనీ, అది కూడా చట్ట వ్యతిరేకుల పైనే ఎక్కువగా దృష్టిని సారించామని ప్రభాకర్‌రావు సమాధానాలిచ్చినట్టు సమాచారం. ఈ సందర్భంగా కొందరు రాజకీయ ప్రముఖుల ఫోన్లను ఎందుకు ట్యాపింగ్ చేశారనే విషయంలో మాజీ ఐజీ నుంచి నేరుగా సమాధానాలు రాలేదని తెలిసింది. మరికొన్ని ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు కూడా ఆయన ఇచ్చినట్టు సమాచారం. కాగా సుప్రీంకోర్టు ఆదేశాలనుసారం ప్రభాకర్‌రావుకు ఆయన నివాసం నుంచే భోజనంతో పాటు ఆయనకు అవసరమైన ట్యాబ్లెట్లు తెప్పించి ఆయనకు ఇస్తున్నారు.




## అందెశ్రీని ప్రపంచానికి పరిచయం చేసింది సమాచార శాఖనే

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రజాకవి అందెశ్రీని ప్రపంచానికి పరిచయం చేసింది సమాచార శాఖనే అని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, సామాచార, పౌర సంబంధాల శాఖ పూర్వ స్పెషల్ కమిషనర్ ఫణికుమార్ తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విశ్రాంత ఉద్యోగుల వార్షిక ఆత్మీయ సమ్మేళనం ఆదివారంనాడిక్కడి ఖైరతాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశమందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఆయనతోపాటు రిటైర్డ్ డైరెక్టర్లు కిస్మత్‌కుమార్, సుభాష్‌గౌడ్, సత్యారావు, శ్రీనివాస్, ప్రమోద్‌రావు సహా విశ్రాంత అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ 2001లో జరిగిన మహిళా జన్మభూమి కార్యక్రమానికి తమ శాఖాపరమైన ఆహ్వానంపై అందెశ్రీ ఎన్నో ఉత్తేజకరమైన పాటలు రాసారనీ, ఆ పాటల్లో తెలంగాణకు వ్యతిరేకంగా, కించపరుస్తూ రాయబోనని అప్పట్లోనే స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. ఆ పాటలతోనే అందెశ్రీని సమాచారశాఖ ప్రపంచానికి పరిచయం చేసిందని వివరించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో సమాచార, పౌర సంబందాల శాఖ ఎంతో విశిష్టమైనదని, ఎంతటి క్లిష్టమైన ఈవెంట్లనైనా అతితక్కువ వ్యయంతో కష్టపడి, స్వచ్ఛందంగా పనిచేసి విజయవంతం చేసే అధికారులు, సిబ్బంది ఉన్నారని ప్రసంసించారు. ఇతర ఏశాఖలో ఉత్పన్నం వచ్చినా అది మనదే అని ఫీల్ అవడం సమాచార శాఖకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి సహా వీవీఐపీలతో నేరుగా ప్రత్యక్షంగా పనిచేసే శాఖ కూడా ఇదేనని చెప్పారు. ఇంటలిజెన్స్‌తో సమానంగా సమాచార శాఖ పనిచేస్తుందన్నారు. అయితే పీఆర్ఓ విధుల నిర్వర్తించడం ఆషామాషీ శాఖ కాదనీ, ఎంత చేసినా అద్భుతంగా చేశారని ఎవరూ మెచ్చుకోరని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో 75 ఏండ్లు పూర్తి చేసుకున్న రిటైర్డ్ అధికారులు, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. లీగల్ అంశాలపై ప్రసంగం, యోగా, ఆరోగ్య విషయాలపై ప్రత్యేక క్లాసులు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



# రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు సాఫీగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.





పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి ఆదివారం సారంగాపూర్ మండలం ధని గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగ్ బూత్‌ల వారీగా సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికల సరళిని పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ వివరాలు తప్పనిసరిగా పంపాలని సూచించారు. ఓటర్లతో మాట్లాడి కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. లెక్కింపు హాలులో ఏర్పాట్లు పరిశీలించి, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పటిష్ట భద్రత కల్పించాలని ఆదేశించారు. మొదటి దశ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్న కలెక్టర్, ప్రజలందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీలో డి పి ఓ శ్రీనివాస, ప్రత్యేక అధికారి బాలిక్ అహ్మద్, తహసిల్దార్ సంధ్య రాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మూడవ విడత పోలింగ్ నేపథ్యంలో ఆరు మండలాల్లో నిషేధాజ్ఞలు: మద్యం దుకాణాలు మూసివేత.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఆదిలాబాద్ జిల్లాలో గ్రామపంచాయతీ మూడవ విడత ఎన్నికలు డిసెంబర్ 17న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరగనున్న నేపథ్యంలో, ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బోథ్, సోనాల, బజార్హత్నూర్, నేరడిగొండ, గుడిహత్నూర్, తలమడుగు మండలాల్లో అభ్యర్థులు డిసెంబర్ 15న సాయంత్రం 5 గంటలలోపు ప్రచారం ముగించాలని, ఆ తర్వాత బహిరంగ సభలు, ర్యాలీలు, మైక్ అనౌన్స్‌మెంట్లు తదితర కార్యక్రమాలు నిషేధమని స్పష్టం చేశారు. ఈ ఆరు మండలాల్లో %బావఎ.163 దీబీూా% ప్రకారం నిషేధాజ్ఞలు డిసెంబర్ 15 సాయంత్రం 5 గంటల నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడడం నిషేధమని, శాంతిభద్రతల విషయంలో ఎటువంటి రాజీ ఉండదని హెచ్చరించారు. ప్రచారం ముగిసిన వెంటనే మద్యం దుకాణాలు, బార్లు పూర్తిగా మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయన్నారు. డిసెంబర్ 17న పోలింగ్ అనంతరం అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు.

# డ్యాంగాపూర్ గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.







అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లాలో రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా, నిర్మల్ గ్రామీణ మండలం డ్యాంగాపూర్ గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాల, అంగన్వాడి కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ కొనసాగుతున్న పోలింగ్ ను పరిశీలించారు. ఓటర్లకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు చూశారు. నమోదైన పోలింగ్ వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటింగ్, కౌంటింగ్, ఉప సర్పంచ్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని నిర్వహించాలని ఎన్నికల అధికారులకు కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ త్వరగా ముగించాలని అన్నారు. ఈ ఎన్నికల కేంద్రం తనిఖీలో ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపివో శ్రీనివాస్, ఎంపీడీఓ గజానన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ లను సన్మానించిన మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్



ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ డిసెంబర్ 14 నూతనంగా ఎన్నికైన ఇబ్రహీంపట్నం మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్ లను ఉపసర్పంచ్ లను సన్మానం చేసిన ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, గోధుర్ సర్పంచ్ బండి రాజేష్, యామపూర్ సర్పంచ్ కనుక నగేష్, ఫకీర్ కొండాపూర్ సర్పంచ్ తోట రమేష్, వేములకుర్తి సర్పంచ్ తరీ రామానుజం, ఎర్ద0డి సర్పంచ్ కల్లెడ గంగాధర్ (బుజ్జి ), కోజన్ కొత్తూరు సర్పంచ్ చల్ల రక్షత పురుషోత్తం, కోమటి కొండాపూర్ సర్పంచ్ కోప్పేలా పద్మజ వెంకట్, వర్షకొండ సర్పంచ్ పోనకంటి వెంకటి, అమ్మక్కపేట సర్పంచ్ కశి రెడ్డి భాస్కర్ రెడ్డి మరియు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ sc సెల్ అధ్యక్షులు దూదిగం గంగాధర్, జనార్దన్ మరియు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# గోదూరు సర్పంచ్, ఉప సర్పంచ్ లకు సన్మానం



ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ డిసెంబర్ 14 జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గూడూరు గ్రామంలో మొదటి విడతలో సర్పంచ్ గా బండి రాజేష్ ఉపసర్పంచ్ లక్ష్మణు లు గెలుపొందగా వారిని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు సన్మానించారు, ఇట్టి కార్యక్రమంలో దీపక్ జూమ్ ,వలకొండ శ్రీధర్, ఉ ంగరాల శేఖర్ ,వలకొండ జనార్ధన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు

# మామ పై కోడలు గెలుపు.

## రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో ఆసక్తికర విజయం.



జగిత్యాల అమృత్ తెలంగాణ డిసెంబర్ 14: రాష్ట్రంలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆసక్తికర విజయం నమోదైంది. మామపై కోడలు విజయం సాధించింది. జగిత్యాల జిల్లా రాయికల్ రాయికల్ మండలం శ్రీరాంనగర్‌లో మామ సత్యనారాయణ(కాంగ్రెస్ మద్దతు)పై కోడలు రాధిక(బీజేపీ మద్దతుదారు) 14 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

# రెండో దశ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం ఆదివారం, జిల్లాలో రెండో విడత ఎన్నికలు జరుగుతున్న పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మల్ గ్రామీణ మండలంలోని వెంగ్వాపేట్, తల్వేద, లంగ్డాపూర్, గ్రామాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న పోలింగ్ సరళిని చూశారు. ఓట్లు వేయడానికి వచ్చిన ఓటర్లకు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో పరిశీలించారు. అధికారులతో మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని పకడ్బందీగా పూర్తి చేయాలని అన్నారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న జగిత్యాల ఎమ్మెల్యే దంపతులు



జగిత్యాల అమృత్ తెలంగాణ డిసెంబర్ 14: జగిత్యాల జిల్లాలో రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మరియు ఆయన సతీమణి రాధిక గారు తమ స్వంత గ్రామం, జగిత్యాల మండలం అంతర్గం గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రజాస్వామ్య విధులను వారు నిర్వర్తించారు.

# మూడు మండలాల్లో జీపీ ఎన్నికలు ప్రశాంతం

రాజన్న సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట తంగళ్ళపల్లి బోయినపల్లి మండలాల్లో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ఆదివారం జరిగింది. బోయినపల్లి మండలంలో పురుషుల ఓట్లు 14753, స్త్రీల ఓట్లు 15752 మొత్తం 30505 ఓట్లకు 24437 ఓట్లు పోలు కాగా 80.11 శాతం, ఇల్లంతకుంట మండలంలో పురుషుల ఓట్లు 17401 స్త్రీల ఓట్లు 18531 మొత్తం 35932 ఓట్లకు 30413 ఓట్లు పోలు కాగా 84.64 శాతం, తంగళ్ళపల్లి మండలంలో పురుషుల ఓట్లు 18619 స్త్రీల ఓట్లు 19848 మొత్తం 38468 ఓట్లకు 29896 ఓట్లు పోలుకాగా 77.72 శాతం పోలయ్యాయి. మూడు మండలాలు కలిపి 80.78 శాతం ఓట్లు నమోదు అయ్యాయి.బోయినపల్లి,కోదురుపాక,నీలోజపల్లి,విలసాగర్, ఇల్లంతకుంట మండలంలోనీ ఇల్లంతకుంట, కందికట్కూర్, పోత్తూరు, అనంతారం గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ మహేష్ బిగితే సందర్శించి పోలింగ్ జరుగుతున్న తిరును పరిశీలించి విధులలో ఉన్న సిబ్బందికి భద్రత పరమైన పలు సూచనలు చేశారు.

వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరించిన జిల్లా ఎస్పీ

ఇల్లంతకుంట మండలంలో పోలింగ్ కేంద్రం పరిశీలనలో బాగంగా 100 సంవత్సరాలు నిండి ఓటు హక్కును వినియోగించుకువడానికి వచ్చిన లక్ష్మీ అనే వృద్ధురాలిని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆప్యాయంగా పలకరించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# జగిత్యాల జిల్లా లో రెండో విడతలో తగ్గిన పోలింగ్.



జగిత్యాల అమృత్ తెలంగాణ డిసెంబర్ 14: జిల్లాలో ఆదివారం జరిగిన 2వ విడత పంచాయతీ ఎన్నికల్లో 134 గ్రామ పంచాయతీలకు పోలింగ్ జరిగింది. మొదటి విడతలో 77.06% పోలింగ్ నమోదు కాగా, రెండో విడతలో 74.07% పోలింగ్ నమోదైంది. దీంతో రెండో విడతలో పోలింగ్ శాతం తగ్గింది. సారంగాపూర్, జగిత్యాల రూరల్ మండలాల్లో 80% వరకు పోలింగ్ నమోదు కాగా, మల్యాలలో 60% మాత్రమే నమోదైంది.

# మిషన్ భగీరథ నీరు వృధా.. పట్టించుకోని అధికారులు

రామగిరి : రామగిరి మండలంలోని నాగేపల్లి గ్రామ శివారు స్మశాన వాటికకు దగ్గరలో మిషన్ భగీరథ నీరు చెక్వాల్ చెడిపోయి మంథని పెద్దపల్లి ప్రధాన రహదారి వెంబడి దాదాపు 5 హెచ్పి మోటర్ పంపు పోసినట్టుగా వృధాగా పోతున్నాయి. గత వారం రోజులుగా ఈ నీరు వృధా అవుతున్న సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని సమీపంలోని గ్రామస్తుడు బండి రమేష్ తెలిపారు. మంథని పెద్దపల్లి ప్రధాన రహదారి వెంబడి ఈ విధంగా నీరు వృధా అయిన నిత్యం వేలాది మంది రాకపోకలు జరుగుతాయి. అదేవిధంగా ఇక్కడి నుండి అన్ని డిపార్ట్మెంట్లో సంబంధించిన అధికారులు కూడా వెళ్తుంటారు. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

# సర్పంచ్ విజయంతో కుస్లీ లో సంబరాలు జరుపుకుంటున్న కార్యకర్తలు

## సర్పంచ్ గా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి. కుస్లీ సర్పంచ్ గా నర్వాడి ప్రవీణ్ పటేల్....



సర్పంచ్ విజయంతో కుస్లీ లో సంబరాలు జరుపుకుంటున్న కార్యకర్తలు

నర్సాపూర్ జి డిసెంబర్ 14 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండల కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ఇంద్ర రెడ్డి, 1665 ఓట్లతో ఘన విజయం సాధించారు నర్సాపూర్ జి మండలంలోని కుస్లి సర్పంచ్ గా బిజెపి అభ్యర్థి నర్వాడే ప్రవీణ్ పటేల్, 365 ఓట్ల మెజారిటీతో సర్పంచ్ గా గెల్పొదడం జరిగింది నర్సాపూర్ మండలం లోని 13 గ్రామపంచాయతీల లో జరిగిన ఎన్నికల్లో 10 మంది కాంగ్రెస్ అభ్యర్థులు గెల్పొందగా 3 బిజెపి అభ్యర్థులు గెలుపొందడం జరిగింది

# కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవు.

**రెండవ విడతలు కోడ్ ఉల్లంఘనలో 27 కేసులు నమోదు.**
**మద్యం పంచుతూ, ప్రచారం చేస్తూ, విధుల నిర్వహణ కు అడ్డుపడుతూ, 100 మీటర్ల లోపు గుమ్మి గుడి ఉంటూ ఉన్న 66 మంది పై కేసులు**
**భీంపూర్ 1, రూరల్ 8, మావలా 2, తాంసి 3, బేల 4, జైనథ్ లో 9 కేసులు నమోదు.**
**ఎన్నికల సమయంలో ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలి.**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.**



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంలో జిల్లాలోని ఎనిమిది మండలాలలోని ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ ఎన్నికలలో ఇప్పటివరకు 27 కేసులు నమోదు చేయబడ్డాయని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల విధులను నిర్వహిస్తున్న పోలీసుల కు అడ్డుపడిన, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన, మద్యం పంచుతూ, ఆహార పదార్థాలు పంచుతూ, బహుమతులు పంచుతూ, ఎన్నికల సమయం పూర్తయిన తర్వాత ప్రచారం చేస్తూ ఉన్నటువంటి సందర్భాలలో దాదాపు 66 మంది పై ఇప్పటి వరకు కేసులు నమోదు చేయబడ్డాయి అన్నారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఉల్లంఘనాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం నుండి ప్రారంభమైన ఎన్నికలు ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతిభద్ర సమస్యలు తలెత్తకుండా ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. 8 మండలాలకు ఉన్న ఆరు పోలీస్ స్టేషన్ లలో భీంపూర్ 1, రూరల్ 8, మావలా 2, తాంసి 3, బేల 4, జైనథ్ లో 9 కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

భీంపూర్ మండలం (1 కేసు)

1 భీంపూర్ మండలం గుంజాల గ్రామం నందు సర్పంచ్ అభ్యర్థి రామేశ్వర్ కు మద్దతుగా అతని అనుచరుడు ఆత్రం గంగారం మద్యం బాటిల్లు పంచుతుండగా లభ్యమైనట్టు ఫిర్యాదుతో ఇద్దరిపై భీంపూర్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు.

ఆదిలాబాద్ రూరల్ మండలం (8 కేసులు నమోదు)

2యాపలగూడ గ్రామం నందు మూడు కేసులు నమోదు కాగా అందులో రెండు మద్యం పంచుతున్న కేసులు. ఇంకొకటి ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు.

3 రామయి గ్రామం నందు మద్యం పంచుతున్నట్టు కేసు నమోదు.

4 లాండ సాంగ్వి గ్రామం నందు ఓటర్లను ప్రభావితం చేసేలా నగదు డబ్బు పంచుతున్నప్పుడు కేసు నమోదు అయిందని తెలిపారు.

5 తంతోలి, చాందా, అంకోలి గ్రామాల నందు 100 మీటర్ల లోపు ఎన్నికలు జరుగు సమయంలో కోడ్ ఉల్లంఘన పై మూడు కేసుల నమోదు అయినట్లు తెలిపారు.

మావల మండలం (2 కేసులు)

6బట్టి సావర్గం గ్రామం నందు గత రాత్రి తన అభ్యర్థికి అనుగుణంగా ప్రజలకు డబ్బుతో ప్రలోభం పెడుతూ ఉన్న ఆంద్ర వినోద్ పై ఒక కేసు నమోదు చేసి 3000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

7 మావల గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో రఘుపతి 15 మంది వ్యక్తులతో సమావేశం ఏర్పాటు చేయగా అతనిపై మరియు మిగిలిన 14 మందిపై మావల పోలీస్ స్టేషన్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేయడం జరిగింది.

తాంసి మండలం (మూడు కేసులు)

8 గోట్కూరి గ్రామం నందు వార్డు మెంబర్ కి అనుకూలంగా మద్యం పంచుతూ లింగన్న అనే వ్యక్తి పై కేసు నమోదు అయిందని తన వద్ద నుండి రెండు ఫుల్ బాటిల్స్ 30 కళ్ళు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

9కపర్ల గ్రామం నందు ఈరోజు ఉదయం ఓటర్లను ప్రభావితం చేసేందుకు వండిన ఆహార పదార్థం ఇచ్చిన ముగ్గురిపై కేసు నమోదు అయిందన్నారు.

తాంసి గ్రామం నందు ఈరోజు ఉదయం ఓటర్లను ప్రభావితం చేసేలా అల్పాహారం అందజేసినందుకు గాను ఒకరిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

జైనథ్ మండలం (9 కేసులు నమోదు)

11 జైనథ్, దీపాయిగూడ, అనంతపూర్, కాపిరి గ్రామాలలో ఎన్నికల కోడ్ నియమ నిబంధనలు అమలులో ఉన్నప్పుడు వాటిని ఉల్లంఘించి నందుకుగాను బ్యాలెట్ పేపర్లను పంచుతున్నటువంటి నలుగురిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

జైనత్ మండల కేంద్రంలో 100 మీటర్ల లోపు గుమ్మిగూడి ఉన్నటువంటి 20 మందిపై కేసు నమోదు చేయడం జరిగింది అన్నారు.

లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఓటర్లను ప్రలోభపెట్టేలా వండిన అన్నాన్ని పంచుతున్నటువంటి స్వామి అనే వార్డు మెంబర్ పై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

తర్నం గ్రామపంచాయతీలో ఎన్నికల విధులలో ఉన్నటువంటి ఏఎస్ఐ తో వాగ్వాదానికి దిగిన ఏజెంట్ పై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు

లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గత రాత్రి ఇద్దరిపై వార్డ్ మెంబర్ కి అనుకూలంగా మద్యం పంచుతున్నటువంటి వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మద్యాన్ని ఎక్కువ ధరకు అమ్ముతున్న ఒక వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. బేల మండలం (4 కేసులు

# లక్ష్మీదేవి కాల్వ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

అడ్డగూడూర్:అమృత్ తెలంగాణ: పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బిఆర్ఎస్ పార్టీ నాయకులు బలపరిచిన , మద్దతు తెలిపిన సిపిఎం నాయకులు బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గా నక్క సూరమ్మ అబ్బయ్య అన్నారు. లక్ష్మీదేవి కాలువ గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో తిరుగుతూ ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి సర్పంచిగా తను ఎన్నుకోవాలని అభ్యర్థించారు. గ్రామంలోనీ ఓటర్లు ఉంగరం గుర్తుకు ఓటు వేసి నన్ను గెలిపించాలని కోరారు. నన్ను గెలిపిస్తే గ్రామంలో ఉన్నటువంటి సమస్యలు దగ్గరుండి పరిష్కరిస్తానని అన్నారు. డ్రైనేజీ సమస్యలను , వీధి దీపాలు , పెన్షన్లు రాని వాళ్లకు పెన్షన్లు కూడా వచ్చేలా చేస్తామన్నారు. దెబ్బతిన్న బీటీ రోడ్లకు నిధులు మంజూరు చేయించి నూతన రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు . మీ అమూల్యమైన ఓటును ఉంగరం గుర్తుకు వేసి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బలపరిచిన ముఖ్య నాయకులు మహిళలు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. పొన్నాల వెంకటేశ్వర్లు , చిగుళ్ల ఉపేంద్ర , కొలుగూరి రాములు , బొమ్మగాని నాగయ్య , చెరుకు మధు , చిగుళ్ల వీరయ్య , కన్నెబోయిన గంగులు , గ్రామ శాఖ అధ్యక్షులు మారోజు వెంకన్న , మద్దతు తెలిపిన సిపిఎం నాయకులు ఆకుల సోమల్లయ్య , మామిండ్ల నరసయ్య , పడమటి ముత్తయ్య , పొన్నాల చంద్రకళ , బొమ్మగాని పద్మ , శ్రీను, అనిత , మహిళలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# గట్టుసింగారం గ్రామాన్ని ఉత్తమ గ్రామా పంచాయతీగా తీర్చిదిద్దుతా

అడ్డగూడూర్ : అమృత్ తెలంగాణ: గట్టుసింగారం గ్రామాన్ని ఉత్తమ గ్రామా పంచాయతీగా తీర్చిదిద్దుతానని గ్రామ శాఖ సీనియర్ కాంగ్రెస్ నాయకులు బలపరిచిన అభ్యర్థి కాంగ్రెస్ పార్టీ స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి గా ఏనుగుతల ఉపేంద్ర నాగరాజు అన్నారు. ఆదివారం అడ్డగూడూరు మండలంలోని గట్టు సగారం గ్రామంలో జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి ఏనుగుతల ఉపేంద్ర నాగరాజు మాట్లాడుతూ.. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే పథకాలు చేరేలా కృషి చేస్తానన్నారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని అన్నారు. పెన్షన్లు రాని వాళ్లకు పెన్షన్లు , మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు రాని వాళ్లకు రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చేస్తానని తెలిపారు. ప్రజల కోసం ప్రత్యేకంగా దగ్గరుండి ఏ సమస్య ఉన్న పరిష్కరించి వారికి సహాయం చేస్తానని అన్నారు. ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. యువత కోసం క్రీడా మైదానం ఏర్పాటుచేసి క్రీడా సామాగ్రిని అందుబాటులో ఉంచుతానని తెలిపారు. ఉంగరం గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు మద్ది ధనంజయ , మద్ది మహేశ్వరి , నల్లబెల్లి మంజుల, కేశగాని స్వాతి ,మద్ది పరశురాములు, నీలగిరి వెంకటయ్య మర్రోజు రవీందర్, మద్ది రేణుక, చెరుకు నరసింహ, అల్వాల శంకర్, బలపరిచిన కాంగ్రెస్ నాయకులు నల్లబెల్లి యాదగిరి, గద్దల సోమయ్య , నల్లబెల్లి ఈరయ్య , చెరుకు మంగమ్మ , అల్వాల భూలక్ష్మి , ఏనుగుతల మమత , వల్లపు కిష్టయ్య ,మహిళలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యం

అడ్డ గూడూరు :అమృత్ తెలంగాణ: గ్రామాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని తుంగతుర్తి శాసనసభ్యులు ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. అడ్డగూడూరు మండల పరిధిలోని చిర్ర గూడూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి చిత్తలూరి సోమనారాయణ బ్యాట్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆదివారం ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ చిత్తలూరు హనుమంతరావు , ఇటకాల చిరంజీవి, చిత్తలూరు రవీందర్, మందుల సోమయ్య ,శీల రవి,చిత్తలూరి సుధాకర్, కుంభం గోపాల్,ఎస్.కె సయ్యద్ కుటికంటిరమేష్, పసల రవి, పత్రపాటి ఉపేందర్, శీల లింగమాలు, దర్శనాల సతీష్ , మహిళలు , నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సాపిగా రెండో విడత ఎన్నికలు...

**పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్



జిల్లా ఎస్పీతో కలిసి పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్



కుస్లీ సర్పంచ్ గా నర్వాడి ప్రవీణ్ పటేల్,



ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధురాలు



బూరుగుపల్లి తాండ సర్పంచిగా అరుణ్ లాల్



అంజనీ తాండ సర్పంచిగా రాథోడ్ శ్రీనివాస్



నర్సాపూర్ జి మండలంలో అత్యధిక మెజారిటీతో సర్పంచ్ గా గెలిచిన గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ జిల్లా డిసెంబర్ 14 అమృత్ తెలంగాణ సారంగాపూర్ మండలం ధని గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగ్ బూత్‌ల వారీగా సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికల సరళిని పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ వివరాలు తప్పనిసరిగా పంపాలని సూచించారు. ఓటర్లతో మాట్లాడి కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. లెక్కింపు హాలులో ఏర్పాట్లు పరిశీలించి, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పటిష్ట భద్రత కల్పించాలని ఆదేశించారు. మొదటి దశ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్న కలెక్టర్, ప్రజలందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీలో డి పి ఓ శ్రీనివాస, ప్రత్యేక అధికారి బాలిక్ అహ్మద్, తహసిల్దార్ సంధ్య రాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# నేను నాయకుని కాదు.. మీ సేవకుడిని

అచ్చంపేట :అమృత్ తెలంగాణ: నేను నాయకుని కాదు.. మీ సేవకుడిని. సర్పంచ్ గా ఆదరించండి.. ఉప్పునుంతల గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి చింతగాళ్ల శ్రీనివాసులు అన్నారు. ప్రచారంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో కాలనీ లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు, ప్రతి ఇంటికి ఉచిత విద్యుత్తు, వృద్ధులకు, వికలాంగులకు ప్రతినెలా పింఛన్లు, తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ, రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, పాడి రైతులకు సబ్సిడీ పథకాలు, ఇలా అనేక సంక్షేమ పథకాలు గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా ఐదేళ్లపాటు మీ సేవకునిగా పనిచేస్తానని ఎన్నికల్లో బ్యాట్ గుర్తుకు ఓటు వేసి సర్పంచ్ గా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జన్మనిచ్చిన గ్రామాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఓటర్లు తనకు కల్పించాలన్నారు. మురుగునీరు రోడ్ల మీదికి రాకుండా అన్ని కాలనీలలో డ్రైనేజీల నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటు, అంతర్గత మట్టి రోడ్లను సిసి రోడ్లుగా చేస్తానన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సహకారంతో స్థానిక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి (రాజు) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులు, సెంటర్ లైటింగ్ పనులకు కృషి చేస్తానన్నారు. నిరుద్యోగులకు చదువుకున్న యువకులకు, విద్యార్థులకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయాన్ని అభివృద్ధి పరుస్తానన్నారు.



# అడవుల విస్తీర్ణం తెలుసుకునేలా.. ఇస్రో సరికొత్త పరిజ్ఞానం

జన్నారం :అమృత్ తెలంగాణ: అడవులపై సాంకేతిక సహాయంతో అటవీశాఖ నిఘా పెట్టనుంది. వాటి సంరక్షణకు సరికొత్త పరిజ్ఞానాన్ని ఇస్రో అందించనుంది. ఇస్రో ఏజెన్సీ అయిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ) ద్వారా అటవీ సంపదపై పర్యవేక్ష ణ చేయనుంది. అడవుల తగ్గుదల, పెరుగుదల, పోడు కోసం పోయిన అటవీ భూమి, అగ్నిప్రమా దాలు తదితర అంశాలను ఎస్ఆర్ఎసీసీతో పరిశీలించే అవకాశం ఉంది. అడవులను కాపాడేం దుకు అటవీశాఖ నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా అడవుల శాతం తగ్గితే వాతావరణంలో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. అడవులు సమృద్ధిగా పెరిగితే జీవ కోటికి ఉ పయోగకరంగా ఉంటుంది. గతంలో అధికారులు అటవీ విస్తీర్ణానికి సంబంధించిన రిపో ర్టులు తయారు చేయడానికి 9 నెలల పైగా కాలం పట్టేది, నూతన ఎస్ఆర్ఎస్సీ విధానం ద్వారా అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా కేవలం ఐదు రోజుల్లోనే నివేదిక వచ్చేలా చర్యలు చేపట్టను న్నారు. రాష్ట్రంలోని అన్ని అటవీప్రాంతాలు, కవ్వాల్ టైగర్ జోన్లోని అడవుల విస్తీర్ణం తెలుసుకు నేందుకు ఈ విధానం అమలు చేయనున్నారు.




ఎన్ఆర్ఎస్సీ అంటే..

ఆక్రమణ నుంచి అడవులను రక్షించుకేందుకు అటవీశాఖ ఎస్ఆర్ఎస్సీ రూపొందించింది. హెక్టార్ విస్తీర్ణంలో గల అడవుల మార్పును ఈ విధానంతో కనిపెట్టే అవకాశం ఉంది. అప్టికల్ రిమోట్ సెన్సింగ్, జియోగ్రాఫికల్ ఇన్ఫార్మేషన్ సిస్టమ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్తో కలిసి ఈ విధానం పనిచేస్తుంది. దీన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రయోగించి, ఫలితాల అనంతరం అన్ని ప్రాం తాల్లో ఈ విధానం ద్వారా అంచనా వేసే అవకాశా లున్నాయి.

ఉపయోగాలు ఇలా..

నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఉపయోగించి కాలక్రమే ణా అటవీ విస్తీర్ణం, పరిమాణాన్ని మ్యాప్ చేయడం అడవిని పర్యవేక్షించడం జరుగుతుంది. వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాల గురించి వెంటనే సం బంధిత ప్రాంత అధికారులకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందిస్తుంది. కాలిపోయిన ప్రాం తాలను ట్రాక్ చేయడానికి అటవీ శాఖలకు హెచ్చ రిక అందించడానికి ఉపగ్రహ డేటాను ఉపయోగిస్తుంది. వన్యప్రాణుల ఆవాసాలు, కారిడార్లను పర్యవేక్షించడానికి రిమోట్ సెన్సింగ్ ఉపయో గిస్తారు..

అడవి విస్తీర్ణం తెలుసుకోవచ్చు: జన్నారం ఎఫ్డిఓ రామ్మోహన్

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ద్వారా అడవి విస్తీర్ణం తేలికగా గుర్తించవచ్చు. అక్షాంశాలు, రేఖం శాల ద్వారా ఫొటోలు అందిస్తుంది. ఇప్పటికే శాటి లైట్ ద్వారా అగ్ని ప్రమాదాల గుర్తించడం, సమాచారం చేరవేయడం జరుగుతుంది. ఈ పద్ధతి ద్వారా అడవుల గురించి తెలుసు కోవడం సులభమవుతుంది.

# పోనకల్ సర్పంచ్, వార్డు సభ్యులకు ఘన సన్మానం



జన్నారం :అమృత్ తెలంగాణ: మండల కేంద్రంలోని మహేంద్ర సంఘం భవనంలో పోనకల్ మేజర్ గ్రామపంచాయతీగా ఎన్నికైన నూతన సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ ఉపసర్పంచ్ అప్పాల జలపతి వార్డు సభ్యులు పిల్లి మల్లయ్య, నగూరు సత్యవతి మహేందర్, కోడిజుట్టు రాజన్న లను మండల మహేంద్ర సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర సంఘం మండల అధ్యక్షుడు నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి కోడిగుడ్డు రాజన్న,

కోశాధికారి పిల్లి మల్లయ్య, జిల్లా నాయకులు పర్ల కనకయ్య, చిలువేరు నరసయ్య, కొండయ్య, సంద కృష్ణ, సంద గోపాల్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

# పల్లె చైతన్యం వెల్లివిరిసింది




రాజన్న సిరిసిల్ల :అమృత్ తెలంగాణ: గ్రామపంచాయతీ రెండో విడత ఎన్నికల పోరు ప్రశాంతంగా ముగిసింది ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రెండో విడతలో మూడు మండలాలు 77 గ్రామపంచాయతీలు, 530 వార్డులకు పోలింగ్ కౌంటింగ్ ఉత్సాహంగా ఉత్కంఠగా సాగింది. ఇల్లంతకుంట బోయినపల్లి తంగళ్ళపల్లి మండలాల్లో రెండో విడత ఎన్నికలు జరిగాయి ఆదివారం ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభించి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగింది ప్రతి పల్లెలోనూ చివరి వరకు ఎంత ఉత్సాహంగా ఓట్లు వేయడానికి తరలివచ్చారు అత్యధికంగా రెండో విడతలో 84.41 శాతం ఓటింగ్ జరిగింది. పోలింగ్ ముగిసిన గంట తర్వాత కౌంటింగ్ ప్రారంభించారు పోలింగ్ కేంద్రాల వద్ద పార్టీలకు ప్రమేయం లేకుండా తమకు అనుకూలమైన వ్యక్తుల కోసం ప్రచారం నిర్వహించారు. పల్లెల్లో ఎదురు చూసిన ఎన్నికల సందడి గెలుపు చర్చలు వినిపించాయి రెండవ విడత పంచాయతీ ఎన్నికలను కలెక్టర్ గరీమా అగ్రవాల్ తో పాటు ఎస్పీ మహేష్ బిగితే, అదనపు కలెక్టర్ నగేష్ అదనపు ఎస్పీ చంద్రయ్య ఎన్నికల పరిశీలకులు పోలింగ్ కౌంటింగ్ లను పర్యవేక్షించారు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల నుంచి సౌకర్యాలపై ఆరా తీశారు.

మూడు మండలాల్లో పోలైన ఓట్లు 88,553%

జిల్లాలో రెండవ విడతలో ఇల్లంతకుంట బోయినపల్లి తంగళ్ళపల్లి మండలాల్లో 77 గ్రామపంచాయతీలు, 530 వార్డుల్లో జరిగిన పోలింగ్ లో 88,553 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1,11,148 మంది ఓటర్లు ఉండగా 84.41 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు

# ఒకటి - రెండు..ఐదు ఓట్లతో సర్పంచులు




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం రాంపూర్ లో కాంగ్రెస్ జలపరిచిన గొల్ల రమాదేవి ఒక్క ఓటు తేడాలో గెలుపొందారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మౌలాన్ ఖేడ్ సర్పంచ్ గా చంద్రశేఖర్ రెండు ఓట్ల తేడాతో విజయం సాధించారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కూచిపూడి తండాలో కాంగ్రెస్ మద్దతుదారు హాజీనాయక్, నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కులస్పూర్ తండాలో కాంగ్రెస్ బలపరిచిన లలితాభాయి 5 ఓట్ల తేడాతో గెలిచారు.




# ఆ హీరో అంటే అమ్మడికి అంత క్రష్.. ఓపెన్ గా చెప్పేసింది



ఒకే ఒక్క పాట.. అందులోని ఒకే ఒక్క ఎక్స్ ప్రెషన్ తో ఇంటర్నెట్ ను షేక్ చేయటమే కాదు.. అశేష భారతానికి సుపరిచితం కావటమే కాదు.. దాదాపు ప్రతిఒక్క వాట్సాప్ గ్రూపుల్లో షేర్ అయిన సంచలన హీరోయిన్ ప్రియా ప్రకాష్ వారియర్. గతంలో మీ అభిమాన నటుడు ఎవరు? అన్న ప్రశ్నను వేస్తే.. సమాధానం చెప్పేందుకు చాలా ఇబ్బంది పడేవారు. ఆచితూచి అన్నట్లు సమాధానం చెప్పేవారు. ఇప్పుడు సీన్ మారింది. మీకు ఇష్టమైన హీరో ఎవరంటే.. తడుముకోకుండా సమాధానం చెప్పేయటమే కాదు.. కొందరు హీరోయిన్లు అయితే ఏకంగా తాము ఇష్టపడే హీరోల పేరు.. క్రష్ ఉన్న హీరో పేరును కూడా చెప్పేస్తున్నారు. తాజాగా అలాంటి పనే చేశారు సంచలన హీరోయిన్ ప్రియా ప్రకాష్ వారియర్. ఒరు ఆధార్ లవ్ అనే మూవీతో పాపులర్ అయిన ఆమె.. మలయాళం.. తెలుగుతో పాటు హిందీ మూవీలు కూడా చేశారు. తాజాగా ఆమె చూపు కోలీవుడ్ మీదకు మళ్లినట్లుగా చెబుతున్నారు. ఇటీవల కాలంలో హీరో ధనుష్ కు సంబంధించిన విషయాల్ని తన ఇన్ స్టా లో షేర్ చేస్తూ.. అందరి అటెన్షన్ ను డ్రా చేస్తోంది. తాజాగా ఒక విలేకరి అడిని ప్రశ్నకు ఆమె సమాధానం ఇవ్వటమే కాదు.. తన ఇన్ స్టాలో ధనుష్ కు సంబంధించిన పోస్టులు ఎందుకు పెడుతున్న విషయానికి జస్టిఫికేషన్ ఇచ్చేలా బదులు ఇవ్వటం గమనార్హం.

# ఆ భయంతోనే ఇంట్లో వెంటనే చెప్పలేదు

టాలీవుడ్ ఇండస్ట్రీలో హీరోయిన్ల కొరత చాలా ఎక్కువగా ఉంది. అందులోనూ తెలుగమ్మాయిల కొరత అయితే ఇంకా ఎక్కువగా ఉంది టాలీవుడ్ ఇండస్ట్రీలో హీరోయిన్ల కొరత చాలా ఎక్కువగా ఉంది. అందులోనూ తెలుగమ్మాయిల కొరత అయితే ఇంకా ఎక్కువగా ఉంది.కెరీర్ ఆరంభంలో షార్ట్ ఫిల్మ్ లో నటించిన ప్రియాంక జవాల్కర్ తర్వాత సినీ ఇండస్ట్రీలోకి వచ్చి మెల్లిగా హీరోయిన్ గా మారింది. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన ట్యాక్సీ వాలా సినిమాతో ప్రియాంక హీరోయిన్ గా మారిన విషయం తెలిసిందే.ఆ తర్వాత కిరణ్ అబ్బవరంహీరోగా వచ్చిన కల్యాణ మండపంతో మరో హిట్ ను అందుకున్న ప్రియాంక రీసెంట్ గానే మ్యాడ్ స్క్వేర్ సినిమాలో ఓ కీలక పాత్ర చేసింది. మ్యాడ్ స్క్వేర్ సక్సెస్ అయినందుకు తన ఆనందాన్ని షేర్ చేసుకుంటూ మీడియాతో మాట్లాడిన ప్రియాంక తను చేసిన మొదటి సినిమా గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించింది. చదువు అయిపోయిన తర్వాత నుంచే ప్రియాంక షార్ట్ ఫిల్మ్స్ చేస్తూ ఏదైనా సినిమా ఛాన్స్ వస్తుందేమోనని ట్రై చేస్తూనే ఉంది. ఇంట్లో వాళ్లకు ఆ విషయం తెలిసి కూడా తనకు నచ్చింది చేసుకుంటుందిలే అని ఏమనకుండా వదిలేశారు.



# బాప్ రే.. బీచ్ ని మరిగించిన నోరా వైరస్

డ్యాన్సింగ్ క్వీన్ నోరా ఫతేహి గురించి పరిచయం అవసరం లేదు. సోషల్ మీడియాలో ఇతర నాయికలతో పోలిస్తే చాలా స్పీడ్ గా ఉంటుంది. తరచుగా తన అందమైన ఫోటోలు వీడియోలతో నెటిజనులకు కావాల్సిన ట్రీటిస్తూనే ఉంది. ఇటీవల నోరా తన ఇన్ స్టాగ్రామ్ హ్యాండిల్ లో తన డ్యాన్స్ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో నోరా ఒక బీచ్ లో తన గై గ్యాంగ్ తో కలిసి హీటెక్కించే బీట్ కి డ్యాన్స్ చేస్తూ కనిపించింది. మనోహరి ఎప్పటిలాగే అందంగా కనిపించింది. నోరా ఫతేహి చిస్ బ్రౌన్ లేటెస్ట్ సాంగ్ 'కాల్ మి ఎవ్రీ డే ఇన్ మారిషస్..' కి డ్యాన్స్ చేస్తున్న వీడియోను పోస్ట్ చేసింది. ఆమె స్నేహితులు రజిత్ దేవ్ - మేకప్ ఆర్టిస్ట్ మార్స్ పెడ్రోజో కూడా చేరారు. నోరా బీచ్ లోని ట్రాక్ కోసం తన సాధారణ శైలిలో డ్యాన్స్ చేస్తూ కనిపిస్తుంది. ఆకట్టుకునే ఈ డ్యాన్స్ వీడియోకి 'వైబింగ్ ప్రతిరోజూ కాల్ చేయండి'అని క్యాప్షన్ ని ఇచ్చింది.. వీడియోలో నోరా పింక్ బీచ్ బ్రా- డెనిమ్ మినీ షార్ట్లను ధరించి కనిపించింది. తన పోస్ట్ ను సోషల్ మీడియాలో షేర్ చేయగానే చాలా మంది గుండె -ఫైర్ ఎమోజీలను షేర్ చేసారు. అందాల నోరా డ్యాన్స్ స్కిల్స్ గురించి పరిచయం అవసరం లేదు. ఆమె ఎక్కడైనా డ్రమ్స్ రోల్ విన్నా.. పాప్ బీట్ విన్నా వెంటనే నాగిని నృత్యంతో వెస్ట్రన్ స్టైల్ డ్యాన్స్ లతో కట్టి పడేస్తుంది. బీచ్ లో నోరా ఫతేహి డ్యాన్సులకు వీక్షకులు కూడా జాయినయ్యేంత స్ఫూర్తిని నింపిందని చెప్పాలి. ఇంతకీ ఇది ఏ బీచ్ అంటే? థాయ్లాండ్ లోని ఉష్ణమండల బీచ్ ఇది నోరా ఎల్లపుడూ బీచ్ గాలిలో డ్యాన్స్ చేయడాన్ని చాలా సీరియస్గా తీసుకుంటుందని మనకు తెలుసు. గత సంవత్సరం నోరా ఫతేహి 'వన్ డ్యాన్స్' ఛాలెంజ్ని స్వీకరించినప్పుడు



ఇంటర్నెట్ లో యువతరం తమవైన డ్యాన్స్ కదలికలతో విపరీతంగా స్పందించారు. కానీ ఇప్పుడు అందరూ పింక్ బ్యాండో బికినీ- షార్ట్ లలో నోరాతో పోటీపడాలనుకోవడం ఖాయం. డెనిమ్ షార్ట్- పింక్ బ్యాండ్యూ బికినీ సెట్ లో నోరా చాలా స్పెషల్ గా ఉందని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ బ్యూటీ ప్రస్తుతం డ్యాన్స్ రియాలిటీ షోల జడ్జిగా .. ఐటమ్ భామగా భారీగానే ఆర్జిస్తోంది. విదేశీ ఈవెంట్లు... ఫ్యాషన్ ఈవెంట్లు ...ఇతర ప్రకటనల ద్వారాను ఆదాయాన్ని గణనీయంగా పెంచుకుంది.

# ఓపెన్ బాత్ రూంలోని బాత్ టబ్ లో ముద్దుగుమ్మ అందాల విన్యాసాలు



విశ్వక్సేన్ హీరోగా నటించిన అశోక వనంలో అర్జున కళ్యాణం సినిమాలో హీరోయిన్ గా నటించిన రుక్సార్ ధిల్లాన్ మంచి గుర్తింపును దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ అమ్మడు మొదటి సినిమాతోనే నటిగా పాపులారిటీని సొంతం చేసుకున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఆఫర్స్ దక్కించుకోలేక పోతుంది. దాంతో సోషల్ మీడియాలో సాధ్యమైనంత వరకు ఎక్కువ శాతం మంది దృష్టిని ఆకర్షించాలి అనుకుందో ఏమో కానీ ఇలా అందాల ఆరబోతకు సిద్ధమయింది. గత కొన్నాళ్లుగా ఈ అమ్మడు ఇంస్టాగ్రామ్ లో రెగ్యులర్ గా ఇలాంటి హాట్ ఫోటో షూట్స్ ని ఇస్తుంది. తాజాగా ఓపెన్ బాత్రూంలో బాత్ టబ్ లో పడుకొని బికినీతో ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. బాత్ టబ్ లో ఉండి ఫోటోలకు ఫోజు ఇవ్వడం అంటే మామూలు విషయం కాదు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com